

నేడు అచ్యుతాపురంలో జాతీయ చేనేత దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా 1905లో విదేశీ వస్త్రాలను బహిష్కరిస్తూ స్వదేశీ ఉద్యమం ప్రోత్సహించడానికి ప్రారంభమైన స్వదేశీ ఉద్యమం, స్వదేశీ ఆత్మనిర్భరతకు దోహదపడిన ప్రాథమిక ఉద్యమాల్లో ఒకటిగా చరిత్రలో నిలిచింది. ఈ ఉద్యమాన్ని గుర్తు చేసుకుంటూ 2015 నుండి ప్రధానమంత్రి "మై హ్యాండ్ లూమ్ ..మై ప్రైడ్" పేరుతో ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించి నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో గురువారం ఉదయం నాలుగు రోడ్ల కూడలి నుంచి వీవర్స్ సొసైటీ బిల్డింగ్ వరకు ఉదయం 10:00 గంటల నుండి హ్యాండ్లూమ్ వాక్, అచ్యుతాపురం వీవర్స్ సొసైటీ బిల్డింగ్ వద్ద చేనేత వస్త్ర ప్రదర్శన స్టాల్ , సీనియర్ చేనేత వస్త్ర కార్మికులకు సన్మానం నిర్వహించనున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, శాసన సభ్యులు సుందరపు విజయ్ కుమార్, ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.స్థానిక ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దీర్ఘకాల వ్యాధులకు హోమియో అద్భుతమైన చికిత్స

విశాలాంధ్ర-కే.కోటపాడు: దీర్ఘకాల వ్యాధుల నివారణకు హెూమియో లో అద్భుతమైన ఔషధాలు ఉన్నాయని స్థానిక 30పడకల ఆసుపత్రి హెూమియో విభాగాదిపతి డాక్టర్ సుమన్ లత అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రజల్లో ఇప్పుడిప్పుడే హెూమియో వైద్యంపై ఆదరణ పెరుగుతుందని అన్నారు. దీర్ఘకాల వ్యాధులైన గజ్జి తామర ఇతర చర్మవ్యాధులు, గ్యాస్ ట్రబుల్ ఆయాసం గుండె దడ అలాగే సీజనల్ వ్యాధులైన డెంగ్యూ , చికెన్ గునియా , చికెన్ ఫాక్స్ వడదెబ్బ తదితర వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తగా హెూమియో మందులు వాడుకోవచ్చు అన్నారు. స్థానిక ఆసుపత్రిలో ఒకప్పుడు హెూమియోలో ఓపి అతి తక్కువగా ఉండేదని ప్రస్తుతం గణనీయంగా రోగులు పెరిగారని అన్నారు. అనేకమంది క్రమం తప్పకుండా హెూమియో మందులు వినియోగిస్తున్నారని అన్నారు. షుగరు వ్యాధిని నియంత్రణలో ఉంచేందుకు మంచి ఔషధాలు ఉన్నాయన్నారు. ఆయుష్ విభాగంలో ఆయుర్వేదం యోగ యునాని సిద్ధ వైద్యం హెూమియోపతి ఉన్నాయని, ఇందులో హెూమియో వైద్యానికి డిమాండ్ ఎక్కువగా ఉందన్నారు. ఆసుపత్రిలో మందులు కొరత లేదని , ఎటువంటి వ్యాధులకయినా హెూమియో మందులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా హెూమియో మందుల్లో ఎలాంటి సైడ్ ఎఫెక్టులు కానీ మందుల్లో కాల పరిమితులు కాని ఉండవన్నారు. గ్రామాల్లో హెూమియో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి హెూమియో వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

సిపిఐ నాయకుల కదలికలపై పోలీసులు నిఘా

విశాలాంధ్ర-అనకాపల్లి: జిల్లాలో నక్కపల్లి లో నిర్మించ తలపెట్టిన బల్క్ డ్రగ్ పార్క్ స్థల సేకరణకు బుధవారం జరుగుతున్న ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా పోలీసులు అనకాపల్లి సిపిఐ నేత వైఎస్ భద్రం కదలికలపై మంగళవారం అర్ధరాత్రి నుంచి పోలీసులు కాపలా పెట్టారు. సందర్భంగా భద్రం మాట్లాడుతూ. నక్కపల్లి ప్రాంతంలో నిర్మించ తలపెట్టబో తున్న సుమారు 200 రసాయన పరిశ్రమల వల్ల వేలాది ఎకరాల పంట భూమి బీడు భూముగా మారడంతో పాటు ఆ ప్రాంతంలో ప్రజలు తీవ్ర అనారోగ్య బారినపడి అత్యధిక మరణాలు సంభవించే అవకాశం ఉందని. కాబట్టి బల్క్ డ్రగ్స్ పార్కు నిర్ణయాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే పరవాడ ఫార్మసిటీ పరిశ్రమలలో వరుస ప్రమాదాలు జరిగి వందలాది మంది ప్రజల, కార్మికుల ప్రాణాలు పరిశ్రమల యజమానుల, ప్రభుత్వ అసమర్థత వల్ల గాల్లో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా పోలీసులు నిఘా బెట్టడం అన్యాయమన్నారు.

తల్లిపాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-నర్సీపట్నం రూరల్ : తల్లి ముర్రిపాలతో బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్ట్ అధికారిణి. ఎన్. సూర్యలక్ష్మి పేర్కొన్నారు. నర్సీపట్నంలోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో బుధవారం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ జీవి.రమణ ఆధ్వర్యంలో అంతర్జాతీయ తల్లి పాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా జడ్పిటిసి సభ్యులు సుకల రమణమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లి ముర్రుపాలలో వాటిలో ఉండే పోషకాలు, తల్లి పాలు ఇవ్వడం వల్ల బిడ్డకు తల్లికి కలిగే లాభాలను తెలిపారు. అనంతరం జడ్పిటిసి సభ్యులు సుకల రమణమ్మ చేతులమీదుగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్స్ రామలక్ష్మి , సరోజిని , అప్పల నరస ,రమణమ్మ , సత్యవతి ,అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు సందర్భంగా విద్యార్థులకు క్రీడాపోటీలు

విశాలాంధ్ర -యలమంచిలి: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్లస్ నందు విద్యార్థినులకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు కె. సుశీల, పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఆడారి ఆదిమూర్తి విద్యార్థినులు కు ప్రోత్సాహం అందించారు. అనంతరం పి.డీ శిరీష, మూర్తి క్రీడలను నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గెడ్డం బుజ్జి ఆరోగ్యం కోసం జనసేన నాయకులు పూజలు

విశాలాంధ్ర -యస్. రాయవరం: పాయక రావుపేట నియోజక వర్గం జనసేన ఇంచార్జ్ గెడ్డం బుజ్జి ఆరోగ్యం బాగుండాలని మండల జనసేన యూత్ ప్రెసిడెంట్ లింగంపల్లి జ్యోతి కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు .ఎస్ రాయవరం వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుజ్జి పేరిట పూజలు చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు టేటకాయల అరవింద్ , మాలెం రాజు గొర్లె సతీష్, బొడ్డా నవీన్, బొడ్డా ఆది తదితరులు పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ పార్క్ వద్దు

ప్రజాభిప్రాయ సేకరణలో ముక్తకంఠంగా వ్యతిరేకించిన మత్స్యకారులు, ప్రజా సంఘాల నాయకులు

విశాలాంధ్ర-పాయకరావుపేట: నక్కపల్లి, ఎస్. రాయవరం బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును మత్స్యకారులు, గ్రామస్తులు, రైతులు, ప్రజా సంఘాల నాయకులు ముక్తకంఠంగా వ్యతిరేకించారు. అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండలంలో 1270 ఎకరాలలో ఏర్పాటు చేయ తలపెట్టిన బల్క్ డ్రగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ సంబంధించి నక్కపల్లి తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. నర్సీపట్నం ఆర్డీవో ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు వద్దంటూ పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటు వల్ల స్థానికులకు ఉద్యోగ అవకాశాలు ఉండవు సరి కదా, రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. పరిశ్రమల్లో స్థానికులకు 75శాతం ఉద్యోగాలు కల్పించాలని జీవోలు చెబుతున్న ఇప్పటివరకు ఏర్పాటైన పరిశ్రమలు ఎంత మేర ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో ఇప్పటికే కాలుష్య కోరల్లో ఉన్న తాడి, కృష్ణ పాలెం ప్రజల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. గ్రామాల నుంచి తరలించాలని కోరుతున్న అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాలపై రాష్ట్ర హెూం మంత్రి ఫోన్ చేస్తేనే పట్టించుకోని పరిస్థితుల్లో పరిశ్రమ యాజమాన్యాలు ఉన్నాయని, దుర్మార్గమైన యాజమాన్యాలు పరిశ్రమలు పెడుతున్నారని విమర్శించారు. కాలుష్యం, జబ్బులు స్థానికులకు ఇచ్చేసి పరిశ్రమ యాజమాన్యం కోట్లు గడిస్తున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే, వైయస్సార్సీపి పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు మాట్లాడుతూ పరిశ్రమలు ఏర్పాటు చేసేటప్పుడు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చటం లేదన్నారు. నీరు, భూమి, వాయు కాలుష్యం ఏర్పడి పరిశ్రమ సమీప ప్రాంత ప్రజలు జబ్బులు పాలవుతున్నారని తెలిపారు. రైతుల భూములకు నష్ట పరిహారం చెల్లించకుండా, ధర నిర్ణయించకుండా పనులు చేయడాన్ని విమర్శించారు. ప్రజలను, రైతులను ఒప్పించి పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలి కానీ, నొప్పించి కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మేడిటి శంకర్ మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధికి పరిశ్రమలు ఏర్పాటు చేయాలి కానీ, వినాశనాలు చేసే పరిశ్రమలు వద్దన్నారు. ఉన్న పరిశ్రమలతో మత్స్యకారులు క్యాన్సర్ల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారులను రెచ్చగొట్టే విధంగా అధికారుల ప్రవర్తనను ఆయన తప్పు పట్టారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. రాము మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటు వల్ల అభివృద్ధి కన్నా వినాశనం ఎక్కువ అవుతుందన్నారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు లేవన్నారు. అభివృద్ధి అవసరమైన పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, ఏర్పాటుకు వ్యతిరేకిస్తూ చొక్కా విప్పి నిరసన వ్యక్తం చేశారు. వైయస్సార్సీపి నక్కపల్లి మండల అధ్యక్షులు సీరం నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణగా లేదని, రాజకీయ సభలా ఉందని విమర్శించారు. పరిశ్రమల ఏర్పాట్లు వ్యతిరేకించిన వారిని ముందస్తు అరెస్టులు చేయటం దారుణం అన్నారు. పరిశ్రమ ఏర్పాటును ప్రజలంతా ముక్తకంఠంగా వ్యతిరేకించారన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు గ్రామాల మత్స్యకారులు మాట్లాడుతూ ప్రస్తుతం ఏర్పాటైన పరిశ్రమతో ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నారని, సముద్రంలో మత్స్య సంపద నాశనం అవుతుందని, జల, వాయు కాలుష్యం ఏర్పడ్డాయని, స్థానికులకు ఉపాధి అవకాశాలు లేవని, భూములు ఇచ్చిన రైతులే పరిశ్రమల్లో కూలీలుగా ఉంటున్నారని, భూములు ఇచ్చి తాము రోడ్డున పడమని, బల్క్ డ్రగ్ పార్క్ వద్దని తేల్చి చెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణలో రెచ్చగొట్టే విధంగా, బల్క్ డ్రగ్ పరిశ్రమకు అనుకూలంగా కొంతమంది తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడడంతో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలేపల్లి వెంకటరమణ, మండల కార్యదర్శి వెలుగుల అర్జున్ రావు, మత్స్యకారులు, ప్రజా సంఘం నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున బారికెట్లను విరగగొట్టే ప్రయత్నం చేశారు. పరిశ్రమ ఏర్పాటు వద్దంటూ నినాదాలు చేశారు. ఒక దశలో వీరంతా ప్రజాభిప్రాయ సేకరణ అడ్డుకునేందుకు ప్రయత్నించారు. పెద్ద ఎత్తున తోపులాటలు జరిగాయి. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు వద్దంటూ మత్స్యకారులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. ప్రజాభిప్రాయ సేకరణలో పలువురు వారి వారి అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆర్డిఓ వివి రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఐసీసీ జోనల్ మేనేజర్ నరసింహారావు, తహసిల్దార్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట ఫొటోలు

రజాల, కుమ్మరాపల్లి, కట్టుబోలు గ్రామాల్లో రచ్చబండ

విశాలాంధ్ర-రాంబిల్లి : బాబు షూరిటీ మోసం గ్యారంటీలో భాగంగా 5వ రోజు మండలంలో మాజీ ప్రభుత్వ విప్, యలమంచిలి నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్ కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలో బుధవారం మండలంలో రజాల, కుమ్మరాపల్లి, కట్టుబోలు గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలకు తన శైలి తెలిసేలా వారి సమస్యలను ప్రత్యక్షంగా వినడానికి వారితో ధర్మశ్రీ మమేకమవుతున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ కమిటీలు అతి త్వరగా ఏర్పాటు చేసుకుని, వైసీపీ గత 5 సంవత్సరాలలో ప్రజలకు ఇచ్చిన సంక్షేమ పథకాలు,అభివృద్ధి పనులను వివరించాలన్నారు. అదే విధంగా చంద్రబాబు ఎన్నికలలో ఇచ్చిన సూపర్-6 హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న విధానాన్ని కూడా వివరిస్తూ క్యూర్ ఆర్ కోడ్ ని స్కాన్ చేయించి, ప్రజలు ఒక్కొక్కరు ఎంత అప్పు అయ్యారో తెలియజేయలన్నారు.ప్రతీ నాయకుడు, కార్యకర్త తమ గ్రామాల్లో, వార్డుల్లో వైసిపి పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ 2029లో రాష్ట్రంలో అత్యధిక మెజార్టీతో నియోజకవర్గ ఎమ్మెల్యేను గెలిపించుకుని వైసీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి గిఫ్ట్ గా ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో మండలం పార్టీ అధ్యక్షుడు కిషోర్ రాజు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు , వైసీపీ సీనియర్ నాయకులు నెట్టం సత్యనారాయణ గారు,గోకివాడ సూర్యనారాయణ, నియోజకవర్గ ప్రచార విభాగం అధ్యక్షుడు రామకృష్ణ, నియోజకవర్గ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు రేబాక రాము, మండల యువజన విభాగం అధ్యక్షుడు వెంకి, ఆయా గ్రామాల స్థానిక వైసీపీ నేతలు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ గురుకులం ను ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకస్మిక సందర్శన

విశాలాంధ్ర -నబ్బవరం: మండల కేంద్రంలోని స్థానిక డా బి ఆర్ అంబేద్కర్ గురుకులంను ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేష్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల సదుపా యాలు పట్ల, పరిశుభ్రత పట్ల, విద్యార్థులు చదువుల పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో శ్రద్ధ పెట్టిందని, ప్రభుత్వ లక్ష్యసాధనకు ఉపాధ్యాయులు పనిచేసినప్పుడే సాధ్యమవు తుందని తెలియజేశారు. పేదరికంతో మగ్గుతున్న తల్లిదండ్రుల ఆశలు నెరవేరడానికి, ప్రభుత్వం ఆశయాలు నెరవేరడానికి, ఉపాధ్యాయులు గౌరవం పెరగడానికి ఈ గురుకుల పాఠశాలలో పనితీరు ప్రమాణమని తెలియజేశారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేసినప్పుడే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మరియు సాంఘిక శాఖ మంత్రివర్యులు బాల వీరాంజనేయులు కృషి నెరవేరుతుందని తెలిపారు. గురుకులం పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్ రామకృష్ణ, ఉపాధ్యాయులు, ప్రధానాచార్యులు సబ్బవరపు గణేష్ ని సన్మానించారు.

ఆక్రమణ కు గురవుతున్న ప్రభుత్వ భూమిని రక్షించాలి

విశాలాంధ్ర- సబ్బవరం: ఆక్రమణ కు గురవుతున్న ప్రభుత్వ భూమికి రక్షణ కల్పించాలని మండలంలోని అసకపల్లి పంచాయితీ శివారు ఎరుకునాయుడుపాలెం గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ మొల్లి సింహచల నవనీత వర్మ అలియాస్ చిన్నారావు వి ఎం ఆర్ డి ఎ కమీషనర్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అసకపల్లి పంచాయితీ శివారు ఎరుకునాయుడుపాలెం రెవెన్యూ పరిధిలో గల సర్వే నెంబర్ 75 లో గత ప్రభుత్వం హయాంలో పైడివాడ అగ్రహారం జగనన్న మెగా లే అవుట్ లో పేదలందరికి ఇల్లు నిర్మాణం మరియు ల్యాండ్ పూలింగ్ రైతులకు వి.యమ్.అర్.డి.ఎ వారి ద్వారా లే అవుట్ వేసి ఇళ్ల స్థలాలు మరియు ల్యాండ్ పూలింగ్ రైతులకు లే ఆవుట్ వేసి అభివృద్ధి చేసిన ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసి యిచ్చి యున్నారని, ఆ లేఅవుట్ లో వి.యమ్.అర్.డి.ఎ నిబంధనలు ప్రకారం కొంత స్థలాన్ని సామాజిక అవసరాలకు కేటాయించారన్నారు. ఆ స్థలాన్ని కొంత మంది ప్రవేటు వ్యక్తులు అక్రమించి ప్లాట్లు గా విభజించి అమ్మకం జరిపించుటకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కావున ఆ స్థలమునకు సర్వే జరిపించి హద్దులు నిర్ణయించి, అక్రమణదారులు వేసిన ప్లాట్లను తొలగించి ప్రభుత్వభూమిని కాపాడాలని కోరారు.

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు పంపిణీ

విశాలాంధ్ర -పాయకరావుపేట: పదవ తరగతి, ఇంటర్మీడియట్ లలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 20 మంది విద్యార్థులకు రూ.5 వేలు చొప్పున, ఇంటర్మీడియట్ లో అత్యధిక మార్కులు సాధించిన 23 మంది విద్యార్థులకు రూ.7.500 చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. బ్యాంకు సేవలను అట్టడుగు వర్గాలకు చేరాలని ఉద్దేశ్యంతో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు జోనల్ మేనేజర్ ఠాగూర్ తెలిపారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు యాజమాన్యం చర్యలు తీసుకుంటుందన్నారు. సభ్యులకు ఉత్తమమైన సేవలు అందిం చేందుకు విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్లు సి. కృష్ణమోహన్, నామన కామరాజు, రావు వెంకట జగ్గారావు, మేనేజర్ నాగేశ్వరరావు, వెలుగుల అర్జున్ రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సత్తెమ్మ తల్లి అమ్మవారి ఆలయ శంకుస్థాపన

విశాలాంధ్ర -మునగపాక: మేజర్ పంచాయతీ మునగపాకలో పేరుగాంచిన చెరువు కాలువ సంఘ పరిధిలోని శ్రీ సత్తమ్మ తల్లి అమ్మవారి ఆలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.వేద పండితులు నాని పంతులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.వైయస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్,ఎంపీపీ మళ్ల జయలక్ష్మి సర్పంచ్ దిమ్మల అప్పారావు తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు. సంఘ అధ్యక్షులు, కార్యదర్శులు దాడి చంద్రరావు,వెలగా అప్పలనాయుడు,వెలగా వెంకట అప్పారావు,కర్రి రామ్ జోగినాయుడు,బొడ్డేడ అప్పలనాయుడు,ఆడారి జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

పి ఫోర్ సర్వేలో మార్గదర్శులను గుర్తించి మ్యాపింగ్ పూర్తి చేయాలి



విశాలాంధ్ర-సబ్బవరం : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పి ఫోర్ సర్వే నిర్వహించి బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందని, ఆ కుటుంబాలకు దత్తత తీసుకొని అన్ని మౌళిక వసతులు, సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు వచ్చిన మార్గదర్శులను వెంటనే గుర్తించి మ్యాపింగ్ పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి కె.రమామణి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిఎ లతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటికే మండలంలోని పి ఫోర్ సర్వేలో భాగంగా బంగారు కుటుంబాలు గుర్తించారని అయితే ఆ కుటుంబాలకు దత్తత తీసుకున్న మార్గదర్శులను గుర్తించి మ్యాపింగ్ పూర్తిచేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీవో కె.శివప్రసాద్ నారాయణరావు,పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

తాగునీరు వృధా... సిబ్బందికి పట్టదా?

విశాలాంధ్ర-మునగపాక: మేజర్ పంచాయతీ మునగపాక గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం సమీపంలో కుళాయి పైపు శిథిలమై త్రాగునీరు వృధాగా పోతున్నప్పటికీ పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది నిర్లక్ష్యం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కరువు మండలాల్లో దాహార్తిని దీర్చే దారి లేక ప్రజల విలవిలాడుతుంటే ప్రాణాన్ని నిలబెట్టే నీటిని వృధా చేస్తూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి.ఇంటి పన్ను వసూలు చేయడమే కాదు.ఇటువంటి మరమ్మత్తులు చేయవలసిన బాధ్యత మీకు లేదా అని ప్రశ్నించే పరిస్థితికి తెచ్చుకోకుండా వెంటనే సిబ్బంది స్పందించి కుళాయి మరమ్మత్తులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-సబ్బవరం: తల్లిపాలతో బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని గ్రామ సర్పంచ్ గండి అరుణ అన్నారు. మండలంలోని మొగలిపురం అంగన్వాడి కేంద్రంలో బుధవారం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి వి లలిత కుమారి ఆధ్వర్యంలో ఘనంగా తల్లి పాలు వారోత్సవాలు నిర్వహించారు. అలాగే ఐసిడిఎస్ మరియు సత్యం కాలేజీ ఆఫ్ నర్సింగ్ వారి సౌజన్యంతో తల్లిపాల ప్రాముఖ్యత గురించి నాటిక రూపంలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల వల్ల అప్పుడే పుట్టిన పిల్లలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తమరానా బంగారు నాయుడు, అంగటి నానాజీ, తమరాన సత్యనారాయణ, మేడపాటి రాము, గండి సత్యం,వెన్నెల శంకర్రావు,బైలపూడి రాంబాబు, రాయవరపు శ్రీను,గురి చెంచయ్య,,గ్రామ సెక్రెటరీ రజిని, పిఓ వై.ఇందిరా,సూపర్వైజర్,అంగన్వాడి సిబ్బంది,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వీయ రక్షణ పై విద్యార్థినులకు అవగాహన

విశాలాంధ్ర-చోడవరం: జిల్లా ఎస్పీ, ఉన్నతాధి కారుల ఆదేశాలు మేరకు పాఠశాల విద్యార్థినిలకు స్వీయ రక్షణ సెల్ఫ్ (డిఫెన్స్) పై స్టేషన్ సీఐ పీ. అప్పలరాజు, ఎస్సై ల ఆధ్వర్యం లో బుధవారం నుండి మూడు రోజులు శిక్షణ ప్రారంభించారు. మండలం లోని నరసాపురం లో గల కస్తూరిబా బాలిక విద్యాలయం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణలు ప్రారంభం చేశారు. పాఠశాల బాలికలకు ఆపద సమయంలో తమని తాము దుండగుల నుండి ఎలా రక్షించుకోవాలో తెలియజేయుట కొరకు ఎన్.ఐ.ఎస్ కోచ్ మరియు కరాటే మాస్టర్ గణేష్ వారి ఆధ్వర్యంలో 3 రోజులు పాటు శిక్షణ అందిస్తున్నట్లు మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన నానాజీకి అభినందన

విశాలాంధ్ర -యలమంచిలి/అచ్యుతాపురం : కానిస్టేబుల్ ఎంపికలో ప్రతిభ కనబరిచి, ఉద్యోగానికి ఎంపికైన అచ్యుతాపురం మండలం, దొప్పెర్ల గ్రామానికి చెందిన గండి నానాజీని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, యలమంచిలిలోని తన చాంబర్లో ఘనంగా సత్కరించారు. ప్రతిభ గలవారిని ప్రోత్సాహిస్తూ, వారికి అవకాశాలను అందుబాటులోకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. గ్రామీణ ప్రాంత యువతను ఉత్సాహపరుస్తూ, తగిన గైడెన్స్ ఇస్తూ ప్రతిభావంతులుగా తీసుకెళ్లే పని తమదని సుందరపు విజయ్ కుమార్ అన్నారు.

గంజాయి పట్టివేత

విశాలాంధ్ర-అనకాపల్లి: మండలంలోని కుంచంగి వద్ద గంజాయి తరలిస్తున్న ఆటోను రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను డీఎస్పీ వెల్లడించారు.రూరల్ ఎస్సై రవికురవికుమార్ తన సిబ్బందితో కుంచంగి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానం వచ్చి ఒక ఆటోను తనిఖీ చేయగా అందులో గంజాయి లభ్యమైందన్నారు. వాహనాల తనిఖీని గమనించిన చెన్నయి కి చెందిన వ్యక్తి పరారు అయ్యాడని తెలిపారు. ఆటోను సీజ్ చేసి అందులో ఉన్న 127 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆటో, ఒక సెల్ఫోన్, రెండు వందల రూపాయల నగదు సీజ్ చేశామన్నారు. ఈ ఘటనలో ముంచంగిపుట్టు, పెదబయలు గ్రామాలకు చెందిన ఇద్దరు జువనల్స్ ఉన్నారని, వీరిని బుధవారం జువనల్ హెూంకు తరలించామని తెలిపారు. పరారీలో ఉన్న చెన్నయికి చెందిన వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవికుమార్, హెడ్ కానిస్టేబుల్ సోంబాబు, కానిస్టేబుళ్లు ఎన్.వెంకటరావు, వి. రాజాబాబు, ఆర్కే నాయుడు లను డీఎస్పీ శ్రావణి అభినందించారు.

పాసుపోర్టు పోయినది

కొణతాల నాగార్జున కుమారస్వామి S/o రామకృష్ణ ఎస్. రాయవరం గ్రామం, ఎస్ .రాయవరం మండలం అనకాపల్లి జిల్లా ఆంధ్రప్రదేశ్. **2-08-2025** తేదీన ఎస్ రాయవరం నుంచి ధర్మవరం ఆటోలో వెళ్తున్న సమయంలో నా యొక్క పాసుపోర్టు నెంబరు **టి8548930** పడిపోయింది. ఎంత ప్రయత్నం చేసిన దొరకలేదు .కావున ఎవరికైనా దొరికితే అందజేయగలరు.

ఫోన్ నెంబర్ : **6300086036**

గృహనిర్బంధంలో విపక్ష నేతలు

విశాలాంధ్ర -నక్కపల్లి: నక్కపల్లి మండల కేంద్రంగా ఏపీఐఐసీ బుధవారం నిర్వహిం చిన బల్క్ డ్రగ్స్ పార్క్ కోసం ప్రజా అభిప్రాయ సేకరణ ఎటువంటి ఆందోళనలు జరగకుండా ఉండాలని ఉద్దేశంతో ముందస్తుగా రాష్ట్ర వైకాపా నేత వీసం రామకృష్ణతోపాటు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, ఎస్ రాయవరం సిపిఎం మండల కార్యదర్శి ఎస్ సత్యనారాయణ నక్కపల్లి మండల కార్యదర్శి రాజేష్ లను గృహ నిర్బంధం లో ఉంచుతూ, అరెస్టు చేసి పాయకరావుపేట స్టేషన్ కు రామకృష్ణను అప్పలరాజును ఏ స్టేషన్ లో పెట్టకుండా కారులో అనేక ప్రాంతాల్లో తిప్పుగా రాజేష్ ను గృహ నిర్బంధంలో ఉంచారు. నక్కపల్లి లో బుధవారం జరుపుతున్న ప్రజాభిప్రాయ సేకరణ కు వెళ్ళ కుండా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డిఎస్ పి పోతిరెడ్డి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎస్.రాయవరం ఎస్.ఐ, పోలీసులు ఎక్కడున్నా వారిని అక్కడే అరెస్ట్ చేస్తూ స్టేషన్లకు జీపులో తరలించారు.

మాకు చెప్పకుండా.. మా భూములలో సర్వేలేంటి...

విశాలాంధ్ర-అచ్యుతాపురం: మాకు చెప్పకుండా.. మా భూములలో సర్వేలేంటి... అంటూ రైతులు భయబ్రాంతులకు గురవుతున్నారు . చీమలాపల్లి రెవెన్యూలో అప్పన్నాపాలెం గ్రామం మీదుగా రింగు రోడ్డుకు చేపట్టిన భూ సర్వేను నిలుపుదల చేయాలని రైతులు బుధవారం ఆర్డిఓ కార్యాలయం ఏవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు . చీమలాపల్లి రెవెన్యూ పరిధిలో అప్పన్నపాలెం గ్రామం మీదుగా రైతులు అభిప్రాయాలు తెలుసుకోకుండా సర్వే చేయడం దారుణమని రైతులు వాపోయారు . కంపెనీల కోసం ఫ్లై ఓవర్ రోడ్లు వేస్తున్నారు , అభివృద్ధి పేరు చెప్పి కాయగూరలు పండించే పంట భూముల ను రింగ్ రోడ్డుకి అంటే రైతు నోట్లో మట్టి కొట్టడమే అన్నారు . ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కూండ్రపు సోమునాయుడు , తమరాన బాబురావు , రెడ్డి వెంకటరమణ , రెడ్డి బాబురావు , రెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు .

సాగుచేసే కౌలు రైతులకు పంట రుణాలు ఏవి ?

ఏ.పి. రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు

విశాలాంధ్ర-చోడవరం: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు పూర్తవుతున్నా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయడంలో జాప్యం, పంట రుణాలు అందించే విషయంలో ... ప్రభుత్వ నిర్లక్ష్యం అన్నదాత సుఖీభవ పథకం వర్తింప చేయకుండా అక్టోబర్‌కు వాయిదా వేయటాన్ని పరిశీలిస్తే కౌలు రైతుల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక విలేకరులతో కార్మిక కర్షక నేత రెడ్డిపల్లి మాట్లాడుతూ పంట రుణం తీసుకున్న వారికే పంటల బీమా పథకం అని, లేకపోతే ప్రైవేట్ గా పంటల బీమా పథకంలో చేరాలని చెప్పడం చాలా దారుణమన్నారు. కౌలు రైతులు పంట రుణాలు పొందాలంటే భూ యజమాని బ్యాంకులో ఎటువంటి బకాయిలు ఉండరాదని లేదా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంట రుణాలు తీసుకోకూడదని, కౌలురైతు కూడా బ్యాంకులో ఎటువంటి బకాయిలు ఉండకూడదని, కౌలుగుర్తింపు కార్డుతో పాటు ఇ-పంటలో నమోదు కావాలని అనేక అలవి గాని నిబంధనలు పెట్టి పంట రుణాలు ఇవ్వకుండా అన్నదాతలను గెంటివేస్తున్నారన్నారు. పంటల పెట్టుబడి కోసం దిక్కులేని పరిస్థితుల్లో వడ్డీ వ్యాపారస్తులపై ఆధారపడేటట్టు పాలకులు చేస్తున్నారని తెలియజేశారు. సాగు చేయని వారికి ప్రతి ఏడాది లక్షల కోట్ల రూపాయల పంట రుణాలు ఇస్తున్నారని, వాస్తవంగా పంటలు పండించే కౌలురైతులకు మొండి చెయ్యి చూపిస్తున్నారని తెలిపారు. వ్యవసాయరంగంలో కౌలు రైతులకు పంట రుణాలు, పంటల బీమా, ఇన్పుట్ సబ్సిడీలు, పంటలు అమ్ముకునే వెసులుబాటు, సాగు సాయం లాంటి పథకాలు అందటం లేదని, ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తులపై ఆధారపడే పంటలు పండిస్తున్నారని తెలియజేశారు. ప్రతి ఏడాది కౌలురేట్లుతో పాటు సాగు ఖర్చులు పెరిగి ప్రభుత్వ మద్దతు దక్కకపోగా ఆదాయాలు పడి పోయి అప్పులు పాల్కె ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి రైతాంగం నెట్టవేయబడుతున్నారని అన్నారు. "ఆంధ్రప్రదేశ్ పంట సాగు దారుల హక్కుల చట్టంలోని సెక్షన్ 5 ప్రకారం, గుర్తింపు కార్డు అంటే సిసిఆర్సి (క్రాప్ కల్టివేషన్ రైట్స్‌కార్డ్స్)లు పొందిన కౌలురైతులకు రాష్ట్ర లేదా కేంద్ర ప్రభుత్వం లేదా వ్యవసాయ సహకార సంఘం లేదా షెడ్యూల్డ్ బ్యాంకు లేదా ఏదైనా ఇతర ఆర్థిక సంస్థ నుండి కౌలు ఒప్పందం ప్రకారం భూమిపై పంట రుణం పొందేందుకు మరియు పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టాలు లేదా ప్రభుత్వం రైతులకు అందించే ఏవైనా ఇతర ప్రయోజనాలు లేదా సౌకర్యాలను పొందేందుకు అర్హులని నిబంధనలలో పొందు పర్చారన్నారు. "రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా" ఆదేశాల ప్రకారం రూ. 1.60 లక్షల నుంచి రూ. 2.00 లక్షల వరకు ఎటువంటి హామీ లేకుండానే పంటలు ఆధారంగా కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలని నిర్ణయించారని తెలిపారు . రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎన్ని ఆదేశాలు ఇచ్చినప్పటికీ బ్యాంకులు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ఏర్పాటు చేసుకొని కౌలు రైతులను బ్యాంకు మెట్లు ఎక్క నియ్యకుండా తిరస్కరిస్తున్నారని తెలియజేశారు. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌లోని నిబంధనలు పరిశీలిస్తే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలు ప్రకారం కౌలురైతు సాగు చేస్తున్న భూమి యొక్క సర్వే నెంబర్, వెబ్ ల్యాండ్ పోర్టల్ నమోద్కె ఉండాలని, విస్తీర్ణం, భూమి పట్టదారు పాస్ పుస్తకం, ఖాతా నెంబరు, తదిత వివరాలు అడుగుతున్నారన్నారు. కౌలు గుర్తింపు కార్డు పొందడంతో పాటు ఇ- పంటలో నమోదు కావాలని చెబుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వ కాలంలో ఏ ఒక్క రైతు ఆత్మహత్య చేసుకోవడానికి వీలు లేదని చెబుతారు కానీ, రుణాలు జారీ చేసే విషయంలో మీనమేషాలు లెక్కేస్తూ పరోక్షంగా సాగు చేయని భూ యాజ మానులకు తోడ్పడుతున్నారని తెలిపారు. కూటమి సర్కారుకు కౌలురైతులను ఆదుకోవాలనే చిత్తశుద్ధి ఉంటే వాస్తవ సాగుదారులైన కౌలురైతులందరికీ సులభంగా గుర్తింపు కార్డులు జారీ చేయాలని, గుర్తింపు కార్డులు పొందిన వారికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధన ప్రకారం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ను దృష్టిలో పెట్టుకొని పంటల హామీపై రెండు లక్షల వరకు పంట రుణాలు అందజేయాలని డిమాండ్ చేశారు. మిగిలి న దానికి సంబంధించి సాగు చేస్తున్న భూమి యొక్క దామాషాను బట్టి పంట రుణాలు జారీ చేయాలి. గుర్తింపు కార్డులు రానివారికి జాయింట్ లయబులిటి గ్రూపులు ఏర్పాటు చేసి పంట రుణాలు అందించాలన్నారు.

కొత్తూరు గ్రామంలో పొలం పిలుస్తుంది

విశాలాంధ్ర -రాంబిల్లి: మండలంలో కొత్తూరు గ్రామంలో మండల వ్యవసాయ అధికారి సి.సుమంత ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. హరిపురంలో గల బి.సి.టి.కె.వి.కె.సీనియర్ శాస్త్రవేత్త డా.వనప్రసాదరావు,వరిలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ నాటే సమయంలో చదరపు మీటరుకి 33 కుదుళ్ళు వచ్చే విధంగా నాటడం, దమ్ములో ఎకరానికి 50కేజీ డి.ఎ.పి.లేదా 100 కేజీల సూపర్ ఫాస్ఫేట్ మరియు 15-20కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయడం వల్ల రోగనిరోధకశక్తి పెరగడమే కాకుండ అధిక దిగుబడి వస్తుందని తెలియజేశారు.అన్నదాత సుఖీభవ-పిఎమ్ కిశాన్, చెల్లింపుకు సంబంధించి, క్రెడిట్ అవ్వని రైతులందరూ పేరు మార్పులు,లాండ్ సీడింగ్ మరణ ధ్రువీకరణ, మ్యుటేషన్ కేసులకు సరిచేయించుకొని సంబంధించిన పత్రాలను గ్రీవెన్స్ కోసం రైతుసేవాకేంద్రాల్లో ఉన్న వ్యవసాయ సిబ్బందికి అందజేయాలని మండల వ్యవసాయ అధికారి-సి.సుమంత తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది-హేమ, కనకరత్నం, రామారావు, యం.పి.ఈ.ఓ,కొత్తూరు సర్పంచ్ సాయి,రైతులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలం

మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

విశాలాంధ్ర -పాయకరావుపేట. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు విమర్శించారు. మండలంలోని మాసాహెబ్ పేట గ్రామంలో బాబు షూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోగులు మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్ బుక్ పరిపాలన కొనసాగుతుందని, ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. కూటమి పాలన ఏడాది దాటిన రాష్ట్రం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. వైసిపి ప్రభుత్వం హయాంలో ప్రారంభించిన జగనన్న కాలనీలలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులు చేయడం లేదన్నారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు జడ్పిటిసి లంకా సూర్యనారాయణ, ధనిశెట్టి బాబూరావు, దగ్గుపల్లి సాయిబాబా, జగతా శ్రీను, సుందరలత, గెడ్డమూరి శ్రీనివాసరావు, ధనిశెట్టి సత్య మహేష్, ఇసరపు తాతారావు, కోడా కోటేశ్వరరావు, వంగలపూడి రామారావు, పన్నీరు పాపారావు, పడాల సోమన్న దొర, సఖిలేటి రాము, కొంతం నరేష్, దేవవరపు రాజేష్ ఖన్నా, యజ్జల సత్యనారాయణ, పల్లెల వెంకట్, చేపల తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆత్మ రక్షణ మెలుకువల నేర్పించే తరగతులు ఏర్పాటు చేసిన ఎస్సై

విశాలాంధ్ర-దేవరాపల్లి: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థినులు కు స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సై వి.సత్యన్నారాయణ బుధవారం ఆత్మ రక్షణ మెలుకువలు నేర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులుపై జరిగే దాడులు, ఈవ్ టీజింగు, ఆకతాయిల వేధింపులు, లైంగిక దాడులను ప్రతిఘటించి, వారి దాడులను త్రిప్పి కొట్టేందుకు విద్యార్థినులు తప్పనిసరిగా ఆత్మరక్షణ మెలుకువలు నేర్చుకోవాలని అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు బుధవారం 'క్యాప్సిల్ కోర్స్ %శీఅ% సెల్ఫ్ డిఫెన్స్ ఇన్ స్కూల్స్' పేరిట అవగాహన కల్పించారు. కరాటే కోచ్ గెద్దం నగేష్, అమ్మాయిలకు ఆత్మరక్షణ మెలకువలను నేర్పించారు. ఈ తరహా శిక్షణతో విద్యార్థినులలో ఆత్మన్యూనత భావంను పోగొట్టి, తమను తాము రక్షించుకునేందుకు అవసరమైన ఆత్మ విశ్వాసం, ధైర్యం వస్తుందని, తద్వారా తమను రక్షించేందుకు ఎవరి కోసం వేచి చూడకుండా తామే వారిని ప్రతిఘటించి, రక్షించుకోవచ్చునన్నారు. ఈ శిక్షణ కోసం ఉపాధ్యాయులు కూడా ప్రాధాన్యతనివ్వాలని కోరారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమా, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, కళాశాల అధ్యాపక బృందం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మూతపడ్డ కేంద్ర సహకార బ్యాంకు ఎ.టి.ఎం పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర -చోడవరం: చోడవరం పట్టణంలో గల డి.జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఏటీఎం గడిచిన మూడు నెలలుగా మూత పడిందని బ్యాంకు వినియోగదారులు, రైతాంగం ఆరోపిస్తున్నారు. ఏటీఎం మూతపడి మూడు నెలలు అయినప్పటికీ బ్యాంకు అధికారులు పట్టించుకోపోవడం వెనుక అనేక అనుమానాలు తలెత్తు తున్నాయి. చోడవరం చుట్టుపక్కల సుమారు 40 కోఆపరేటివ్ బ్యాంకు వినియోగదారుల లావాదేవీలు నడిపిస్తున్న ఈ ప్రాంతంలో సహకార బ్యాంకు ఇదొక్కటే. స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు, ప్రభుత్వ పథకాలు సహకార పాలు డైరీ లో సభ్యుల ఖాతాల లావాదేవీలు నిరంతరం సాగుతుండేవి. మూడు నెలలుగా ఏటీఎం మూతపడడంతో ఖాతాదారులు, సహకార రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఖాతాదారుల ఇబ్బందుల పై జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారులు నిర్లక్ష్య వైఖరి వహిస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు తక్షణమే ఉన్నతాధికారులు ఈ విషయంపై స్పందించి ఏటీఎం ను తెరిపించి ఖాతాదారుల లావాదేవీలు సులభతరం చేయవలసిందిగా కోరుతున్నారు.

నిరుపేద కుటుంబాలకు అండగా కూటమి సర్కారు

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ

విశాలాంధ్ర-మునగపాక: నిరుపేద కుటుంబాలకు అండగా కూటమి సర్కారు నిలుస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ అన్నారు.మండలంలో చూచుకొండ,గణపర్తి గ్రామాలలో "సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ లో భాగంగా ప్రతీ హామీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేసే విధంగా కృషి చేస్తున్నారని అన్నారు.3వేల రూపాయలు ఉన్న ఎన్టీఆర్ భరోసా ఫించన్ 4 వేల రూపాయలకు పెంచారని అన్నారు.అధికారంలోకి వచ్చిన వెంటనే పేదవాడికి కంటిమీద కునుకులేకుండా చేసిన ల్యాండ్ టైటలింగ్ చట్టాన్ని రద్దు చేశారని అన్నారు.ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పిన హామీని దీపం పథకం ద్వారా అమలు చేశారని అన్నారు.ఉచిత ఇసుకను అందిస్తున్నారని అన్నారు.ఆగస్టు 15వ తేదీ నుండి ఉచిత బస్ ప్రయాణం అమలు చేసేవిధంగా అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు ఇచ్చారని అన్నారు.ఎన్నికల హామీలను రాష్ట్రం ఎంత ఆర్థిక సంక్షోభంలో ఉన్నా అమలు చేసేవిధంగా కూటమి సర్కార్ ఉందని అన్నారు.పేద ప్రజల ఆకలి బాధలు తీర్చడం కోసమే అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర గవర్నర్ కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు,జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పెంటకోట విజయ్,క్లస్టర్ ఇన్చార్జి కాండ్రేగుల శంకర్,యూనిట్ ఇన్చార్జి కర్రి రామనాగేశ్వరరావు, యూనిట్ ఇన్చార్జి మణికంఠ,చూచుకొండ గ్రామ శాఖ అధ్యక్షులు కాండ్రేగుల గణేష్,గణపర్తి గ్రామ శాఖ అధ్యక్షులు ఆడారి గోపి,మొల్లేటి భాస్కర్,చదరం శంకర్,యల్లపు శంకర్,కాండ్రేగుల దిలీప్,బొడ్డేడ నర్సింగరావు,కాండ్రేగుల చిన్న,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

పెద ఉప్పలం లో పొలం పిలుస్తుంది

విశాలాంధ్ర -యస్. రాయవరం: మండలంలో పెదఉప్పలం గ్రామంలో పొలం పిలుస్తుంది. కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ పరిశోధనా స్థానం,కొక్కిరాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఏ.బీ.యం. శిరీష(ప్రజనన శాస్త్రం), ప్రకృతి వ్యవసాయం పైన అవగాహన కల్పించడం జరిగింది. రైతులకు పచ్చిరొట్ట ఎరువులు ప్రాధాన్యత వాటి యొక్క ఉపయోగాలు పై అవగాహన కల్పించడం జరిగింది. రైతులు పచ్చిరొట్ట ఎరువులు కొబ్బరి తోటల్లో కూడా వేసుకోవడం వలన భూమికి మంచి బలం చేకూరుతుంది. ఇప్పుడు ప్రస్తుతం ఉన్న బెట్ట పరిస్థితులలో వరి నారు కి మరియు ఉడిచిన వరి పైరుకు గాని పోలీయర్ స్ప్రే యూరియా లేదా 19-19-19 లేదా ఫార్ములా - లీటర్ నీటికి 6-7 గ్రాములు కలిపి పిచికారి చేసుకోవడం వలన వరి నారు గాని ఉడికించిన వారిపైరుగాని ఎండిపోకుండా ఉంటుంది. రైతులు సిఫార్సు చేయబడిన ఎరువులను వేసుకోనిరైతులు కాలిబాటలు ఉడిచేటప్పుడు తీసుకోవాలి.రైతులు వరిలో భాస్వరం పొటాష్ ఎరువులు సిఫార్సు చేయబడిన మోతాదులో తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

విశాలాంధ్ర -అచ్యుతాపురం: స్థానిక ఏపీఐఐసీ కార్యాలయంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ నియోజక వర్గంలో గల నాలుగు మండలాలకు చెందిన అన్ని శాఖల అధికారులతో అభివృద్ధిపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడుతూ తమ పరిధిలో ఉన్న గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు . అచ్యుతాపురం కూడలిలో ఫ్లై ఓవర్ పనుల ప్రగతికి సంబంధించిన నివేదిక ఇవ్వాలని ఆర్ %ఆ% బి అధికారులకు సూచించారు . విద్యుత్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఫ్లై ఓవర్ పనులు జరుగుతున్న ప్రదేశాలలో ట్రాఫిక్ కు ఇబ్బందులు లేకుండా కరెంటు స్తంభాలను మార్చడానికి సాధ్యా సాధ్యాలు పరిశీలించాలన్నారు . పోలీసుశాఖ అధికారులతో మాట్లాడుతూ తమ తమ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణతో పాటుగా నేర నియంత్రణలు , అతి వేగంగా నడిపేవారిని పరిశీలించి , కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు . ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు

శ్రీ దేవితల్లి అమ్మవారిని దర్శించుకున్న బొడ్డేడ

విశాలాంధ్ర-మునగపాక: మండలంలో ఉమ్మలాడ గ్రామంలో శ్రీదేవితల్లి అమ్మవారి ఆలయ పునః ప్రారంభోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీదేవితల్లి అమ్మవారిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి,అరకు పార్లమెంట్ పరిశీలకులు బొడ్డేడ ప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి,అమ్మవారి తీర్థ ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.